క్లుప్తంగా

ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని వినతి



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందిస్తున్న రైతులు

రాయికల్: మండలం దావన్‌పల్లి, కట్కాపూర్ గ్రామాల్లోని రైతులకు సరిపడా నీరు విడుదల కాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని మంగళవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే జీవన్‌రెడ్డి సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఉప్పమడుగులో గ్రామస్తుల ఆందోళన



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

రాయికల్: మండలంలోని ఉప్పమడుగు నుంచి సబ్‌స్టేషన్‌కు 33/11 కేవీ విద్యుత్ లైన్లు వేయవద్దని డిమాండ్ చేస్తూ మంగళవారం గ్రామస్తులు ఆందోళన బాట పట్టారు. సుమారు అరగంట పాటు రోడ్డుపై బైఠాయించడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై సుధీర్‌రావు సంఘటన స్థలానికి చేరుకుని 33/11 కేవీ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని, ఆందోళన చెందవద్దని ట్రాన్స్‌కో అధికారులు సైతం గ్రామస్తులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

ఆర్టిజన్ల నిరాహార దీక్ష



నిరాహార దీక్ష చేస్తున్న ఆర్టిజన్ కార్మికులు

జగిత్యాలఅగ్రికల్చర్: తమ సమస్యల పరిష్కారం కోసం ఆర్టిజన్ కార్మికులు మంగళవారం జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట రెండో రోజు నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆర్టిజన్లను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. విద్యార్హతలను బట్టి ఆర్టిజన్లను రెగ్యులరైజ్ చేస్తే, ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడదన్నారు. కార్యక్రమంలో ఆర్టిజన్ల సంఘ నాయకులు రవీందర్ రెడ్డి, తిరుపతి, రమేష్, శ్రీకాంత్, జగన్, జగదీష్‌లు పాల్గొన్నారు.

చెస్ పోటీలు ప్రారంభం



చెస్ ఆడుతున్న సబ్ జడ్జి శర్మ

జగిత్యాలజోన్: జిల్లా కోర్టులో నిర్వహిస్తున్న చెస్ పోటీలను మంగళవారం సీనియర్ సివిల్ జడ్జి శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు చెస్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డబ్బు లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి భూమి రమణకుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

మెట్‌పల్లి: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందిస్తే సమాజంలో మంచి పౌరులుగా ఎదుగుతారని సీఐ నిరంజన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో అక్షర హైస్కూల్‌లో మంగళవారం భారత్ స్కౌట్స్, గైడెన్స్ ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్కౌట్స్, గైడెన్స్ విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించడానికి దోహదం చేస్తుందన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి దీనిలో సభ్యత్వం తీసుకునేలా ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై కిరణ్‌కుమార్, ఎంఈవో చంద్రశేఖర్, కరస్పాండెంట్ కొత్తూరి శ్రీనివాస్, జిల్లా స్కౌట్స్ అధికారులు మధుసూదన్, వినోద్ పాల్గొన్నారు.

సెల్ టవర్ పనులు నిలిపివేయాలి

మెట్‌పల్లి: పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో చేపట్టిన సెల్ టవర్ నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరుతూ కాలనీవాసులు మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇల్లెందుల శ్రీనివాస్, గుంటుక గంగాధర్, నాగభూషణం, గోపి, గణేష్, సురేశ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



జగిత్యాల రూరల్: గుట్రాజ్‌పల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీవో రమాదేవి



కోరుట్ల రూరల్: చిన్నమెట్‌పల్లి గ్రామసభలో అధికారులు

జగిత్యాలరూరల్: ప్రభుత్వం అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుందని జగిత్యాల రూరల్ ఎంపీడీవో రమాదేవి అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం, ఒడ్డెర కాలనీ, గుట్రాజ్‌పల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఆరు పథకాలను అర్హులైన అందరికీ అందించనున్నట్లు తెలిపారు.

కోరుట్ల రూరల్: కోరుట్ల మండలంలోని నాగులపేట, చిన్నమెట్‌పల్లి, తిమ్మయపల్లె గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసేందుకే ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తుందని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు.

రాయికల్: పట్టణం, గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. మంగళవారం రాయికల్ బల్దియాలోని షాదీఖానా, వర్తక సంఘ భవనం, గోసంగివాడ, ఇందిరా నగర్, మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఈవో రాము, మున్సిపల్ వైస్ చైర్మన్ రమాదేవి, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, కౌన్సిలర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని ఏడు గ్రామాల్లో మంగళవారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్తరేషన్‌కార్డులు లబ్ధిదారుల జాబితాను అధికారులు ప్రకటించారు. నిరుపేద కూలీలకు ఆత్మీయభరోసా కింద రూ. 12 వేలు అందించేందుకు ప్రవేశపెట్టిన పథకంలో అనర్హులను జాబితాలో చేర్చారని మంగళవారం చెర్లపల్లి గ్రామస్తులు అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

మల్యాల: మల్యాల మండలంలోని గుడిపేట, గొర్రెగుండం, ఒబులాపూర్ గ్రామాల్లో మంగళవారం ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికపై గ్రామసభలు నిర్వహించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం, ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా, రైతుభరోసా లబ్ధిదారులను ప్రకటించారు.

మల్లాపూర్: సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందిస్తామని తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి, ఎంపీవో జగదీశ్ అన్నారు. పలు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు.

ఇబ్రహీంపట్నం: అర్హులైన వారందరికీ అన్ని పథకాలు వస్తాయని ఆందోళన చెందవద్దని డీఆర్‌డీవో, మండల ప్రత్యేక అధికారి రఘువరన్ అన్నారు. మండలంలోని కొజన్‌కొత్తూర్, ఎర్రాపూర్, బర్దిపూర్, ఫకీర్ కొండాపూర్ గ్రామాల్లో మంగళవారం ప్రత్యేక గ్రామ సభలను నిర్వహించారు.

కథలాపూర్: ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు చేసుకున్నవారిలో ఎందరికి ఇస్తారో స్పష్టం చేయాలని కథలాపూర్ మండలం దుంపేట గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. కథలాపూర్ మండలం దుంపేట, దూలూర్, అంబారిపేట గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు.

పెగడపల్లి: సంక్షేమ పథకాలను నిబంధనల మేరకు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు మండల ప్రత్యేక అధికారి మనోహర్ అన్నారు. మండలంలోని శాలపల్లి, ఏడుమోటలపల్లి, అయితిపల్లి, రాజరాంపల్లి, కీచులాటపల్లి, ఆరవెల్లి గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు మంగళవారం నిర్వహించారు. అధికారులు పాల్గొన్నారు.



సారంగాపూర్: దాదాపు 15 ఏళ్ల కింద నిర్మించిన సారంగాపూర్–పోతారం–బట్టపల్లి బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. కంకరతేలి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.రోడ్డు నిర్మాణం జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు మరమ్మతులు చేయలేదు. ఇప్పుడు రోడ్డు పూర్తిగా శిథిలమై పోయి వాహనాలు నడవడం కూడా కష్టంగా ప్రమాదకరంగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజేందర్, ఏఈ ఆర్‌అండ్‌బీ, సారంగాపూర్, సెల్ నంబర్: 7702353270

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

క్రీడాకారుల శక్తి సామర్థ్యాలే ఆరోగ్య సూచికలు

కోరుట్ల: క్రీడాకారులు చూపే శక్తి సామర్థ్యాలే ఆదేశ ఆరోగ్య సూచికలు అని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కేపీఎల్ సీజన్ 5 క్రికెట్ పోటీలను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. క్రీడా పోటీలు మానసిక ఉల్లాసానికే కాకుండా దేశ అభివృద్ధిని సూచిస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడవాలని ,చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య-అనిల్, వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, కౌన్సిలర్ జిందం లక్ష్మీనారాయణ, ఆర్గనైజర్‌లు మార్త బాలరాజు, ఎండీ మెయిజ్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

టీఎన్జీవో క్యాలెండర్ ఆవిష్కరణ

జగిత్యాల: జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం టీఎన్జీవోలు రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, నాయకులు సహేదాబు, మహబూబ్, మహేందర్, రాజేశం, సుగుణాకర్, మధుకర్, మమత పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాన్ని మార్కింగ్ చేయాలి

ఇబ్రహీంపట్నం: సదర్‌మట్ బ్యారేజీ బ్రిడ్జి నిర్మాణంతో బ్యాక్ వాటర్‌తో ముంపునకు గురయ్యే ప్రాంతాన్ని మార్కింగ్ చేయాలని ఇంజినీరింగ్ అధికారులను మెట్‌పల్లి ఆర్‌డీవో శ్రీనివాస్ ఆదేశించారు. మండలంలోని మూలరాంపూర్ శివారులో గోదావరిపై నిర్మించిన సదర్‌మట్ బ్యారేజీ, బ్రిడ్జి నిర్మాణంతో మండలంలోని కొమటికొండాపూర్ గోదావరిలోని కుర్రు వద్ద, మూలరాంపూర్‌లో మునిగిపోయే భూములను వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. కొమటి కొండాపూర్‌లోని కుర్రులో 40 మంది రైతులకు చెందిన 36 ఎకరాలు, మూలరాంపూర్‌లో 22 మంది రైతులకు చెందిన 16.4 ఎకరాలు భూములు ముంపునకు గురవుతున్నట్లు గుర్తించారు. కొమటికొండాపూర్ గోదావరిలోని కుర్రులో భూములతోపాటు చెట్లు కుడా మునిగిపోతాయని చెట్లకు కూడా నష్టపరిహారం చెల్లించాలని రైతులు ఆర్‌డీవోకు విన్నవించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి చైతన్యశ్రీ, డీఐ దేవరావ్, సర్వేయర్ నర్సయ్య, ఆర్‌ఐలు రేవంత్‌రెడ్డి, రమేష్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ అఖిల్, ఏవో రాజ్‌కుమార్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీవో

నిరుద్యోగులకు అండగా ఉంటా

రాయికల్: నిరుద్యోగులకు అండగా నిలిచి వారి సమస్యలను పరిష్కరించేందుకే పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలలను మంగళవారం సందర్శించి ప్రైవేటు ఉపాధ్యాయుల మద్దతు కోరారు. ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలిచి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఉద్యోగ, నిరుద్యోగ పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అండగా ఉండి, హెల్త్‌కార్డుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. తాను ఎమ్మెల్సీగా గెలిస్తే వచ్చే వేతనాన్ని సంక్షేమ నిధి ఏర్పాటు చేసి నిరుపేద ఉపాధ్యాయులకు, పట్టభద్రుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



ప్రైవేట్ ఉపాధ్యాయులతో నరేందర్‌రెడ్డి

జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

కోరుట్లరూరల్: మండలంలోని కల్లూర్ మోడల్ స్కూల్ విద్యార్థి కిరణ్మయికి జిల్లా స్థాయి ఇంగ్లిష్ ఉపన్యాస పోటీల్లో ప్రథమ స్థానం దక్కింది. ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. 9వ తరగతి చదువుతున్న కిరణ్మయి జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా కిరణ్మయిని ప్రిన్సిపాల్ మోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్‌స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని పేరాల తనుశ్రీ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోషియేషన్ (ఎల్టా) వారు నిర్వహించిన జిల్లా స్థాయి ఇంగ్లిష్ ఒలంపియాడ్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సరితదేవి, ఉపాధ్యాయులు తనుశ్రీని అభినందించారు.



బహుమతి అందుకుంటున్న కిరణ్మయి

ప్రభుత్వ భూముల్లో అక్రమ పట్టాలు రద్దు చేయాలి

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ శివారులోని సర్వేనంబరు 437, 251లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఇతర గ్రామాలకు చెందిన వారు అక్రమంగా పట్టాలు పొందారని, వారి పట్టాలను రద్దు చేయాలని గ్రామంలోని నిరుపేదలకు పట్టాలివ్వాలని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గంట వేణురావు మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఉన్న నిరుపేదలకు పట్టాలివ్వాలని కోరారు.

తుంగూర్ సొసైటీ ఏర్పాటు చేయాలి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంగా ఏర్పాటు చేయాలని మంగళవారం ప్రజాపాలన గ్రామసభలో ప్రజలు ఏకగ్రీవంగా తీర్మానించారు. బీర్‌పూర్ మండలంలో అతిపెద్ద గ్రామం తుంగూర్ అని, గతంలో తుంగూర్ ప్రత్యేక సంఘంగా ఉండేదని, బీర్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో తుంగూర్ గ్రామాన్ని చేర్చారని, ఈ కారణంగా రైతులు ఇబ్బంది పడుతున్నారని, తుంగూర్, కండ్లపల్లి, చెర్లపల్లి, మంగేళ గ్రామాలను కలిపి తుంగూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని గ్రామసభలో ప్రత్యేకాధికారి దేవప్రసాద్‌కు గ్రామస్తులు తీర్మానం కాపీని అందజేశారు.

నామినేటెడ్ పదవుల్లో యాదవులకు ప్రాధాన్యం ఇవ్వాలి

జగిత్యాలరూరల్: నామినేటెడ్ పదవుల్లో యాదవులకు ప్రాధాన్యత కల్పించాలని యాదవ సంఘం అడ్‌హక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గన్నవేని మల్లేశ్ యాదవ్ అన్నారు. మంగళవారం కల్లెడలో యాదవ సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. యాదవులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని, సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్కరు పాల్గొని యాదవుల ఐక్యతను చాటాలన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం అడ్‌హక్ కమిటీ మండల ఇన్‌చార్జి మహేశ్ యాదవ్, మోత్కు మహేశ్ యాదవ్, జలేందర్ యాదవ్, ఎరవేని వినోద్‌యాదవ్ పాల్గొన్నారు.

వివేకానందుడి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

మల్యాల: వివేకానందుని జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని, వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలని నెహ్రూ యువ కేంద్రం సభ్యులు అన్నారు. మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలలో మంగళవారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో జాతీయ యువజన వార్షికోత్సవం నిర్వహించారు. వివేకానందుడి చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అనంతరం వివేకానందుడి జీవిత చరిత్రను వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ఉపన్యాస పోటీలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లాస్థాయిలో ఇంగ్లిష్ ఒలంపియాడ్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థిని డి.హర్షిక ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ మానస తెలిపారు. కార్యక్రమంలో భూమేశ్, గణేశ్, లహరి, ప్రదీప్ పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

మెట్‌పల్లి: పట్టణంలోని వట్టివాగు బ్రిడ్జి వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. వారి కథనం ప్రకారం వంతెన వద్ద పోలీసులు, రెవెన్యూ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా, అక్కడకు ఇసుక లారీ వచ్చింది. దానిని ఆపి తనిఖీలు చేయగా, ఎటువంటి అనుమతులు లేకపోవడంతో లారీని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఇసుకను నిజామాబాద్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

పాఠశాలల్లో ఫుడ్ ఫెస్టివల్

మేడిపల్లి: మండలంలోని కొండాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు వివిధ వంటకాలు స్వయంగా తయారు చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి రాము నాయక్ పాల్గొని, విద్యార్థుల వంటకాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మీనారాయణ, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థినులతో డీఈవో

కోరుట్లరూరల్: మండలంలోని వెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల ఆహార పదార్థాలను ఇంటివద్ద తయారు చేసి పాఠశాలకు తీసుకవచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హరి వరప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎలక్ట్రానిక్స్ వస్తువులు

జగిత్యాల: కార్పొరేట్‌కు దీటుగా జగిత్యాలలో షోరూమ్‌లు వెలుస్తున్నాయని, జిల్లాలోని వినియోగదారులకు ఎలక్ట్రానిక్స్ వస్తువులు అందుబాటులో ఉన్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా యశస్వి షోరూమ్ ఆధ్వర్యంలో మెగా డ్రాలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వినియోగదారుల అభిరుచులకు తగ్గట్లుగా అందించడంలో యశస్వి ఎలక్ట్రానిక్స్ ముందంజలో ఉంటుందన్నారు. బంపర్‌డ్రాలో సాతారంకు చెందిన పనస లావణ్య లక్కీ డ్రాలో కారు గెలుపొందగా, మొదటి బహుమతి బుల్లెట్ జగిత్యాలకు చెందిన యాసిన్ గెలుపొందారు. కార్యక్రమంలో డాక్టర్లు మోహన్‌రెడ్డి, సతీశ్‌కుమార్, యశస్వి ఎలక్ట్రానిక్స్ అధినేత శ్రీనివాస్, నిర్వాహకులు హైమద్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న చైర్‌పర్సన్

మౌలిక వసతులు కల్పించాలి

జగిత్యాల: డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద మౌలిక వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నామని, వెంటనే కల్పించేలా చూడాలని కాలనీవాసులు మంగళవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ కనెక్షన్ లేకపోవడంతో చీకట్లో ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో విద్యుత్ లేకపోవడంతో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. స్పందించిన వారు అధికారులతో మాట్లాడి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ఆదేశించారు. కలిసిన వారిలో స్వామి, ఖలీమ్, గంగాధర్, సుశీల, కిశోర్ ఉన్నారు.

ధరూర్‌లో యువకుడిపై దాడి

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్‌లోని బైపాస్‌రోడ్ వద్ద నున్న వైన్స్ వద్ద సోమవారం రాత్రి అదే గ్రామానికి చెందిన యువకుడు మద్యం మత్తులో మరో యువకుడిపై బీరు సీసాతో దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. కాగా యువకుడిపై పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సారంగాపూర్: మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు కాగా, ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసారు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన పసుల లక్ష్మణ్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుతుండగా అదే గ్రామానికి చెందిన మానుక అఖిల్ తన ద్విచక్రవాహనంతో అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ లక్ష్మణ్‌ను ఢీకొట్టాడు. దీంతో లక్ష్మణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు అఖిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో మేక పిల్లలు మృతి

మేడిపల్లి: మండలంలో వీధి కుక్కల బెడద రోజురోజుకు ఎక్కువైపోతుంది. భీమారం మండలంలోని కమ్మరిపేటలో తాలుక రాజమల్లు మందకు చెందిన ఎనిమిది మేక పిల్లలపై మంగళవారం కుక్కలు దాడి చేసి చంపేశాయి. మేక పిల్లలను దొడ్లో ఉంచి మేకలను మేతకు తీసుకుని వచ్చే సరికి అవి చనిపోయి ఉండడంతో బాధితుడు లబోదిబోమన్నాడు. కుక్కల బెడద తీవ్రంగా ఉందని, అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లెనిన్‌కు నివాళి

జగిత్యాల: ప్రపంచంలో మొదటి సోషలిస్ట్ దేశంగా నిర్మించిన వ్యక్తి లెనిన్ అని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. మంగళవారం కామ్రేడ్ లెనిన్ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రామిక వర్గానికి ఎంతో కృషి చేసిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో నాయకులు వెన్న మహేశ్, హన్మంతు, రాములు, ముత్రం తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ సామాజిక తనిఖీలో అక్రమాలు గుర్తింపు

మెట్‌పల్లిరూరల్: మండలంలోని 23 గ్రామాల్లో ఉపాధి హామీలో చేపట్టిన పనులపై ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు రూ.4.68 కోట్లను వివిధ పనులకు వెచ్చించారు. అయితే ఈ పనులపై తనిఖీలు నిర్వహించి వాటిల్లో పలు అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. దీనికి బాధ్యులైన వారికి జరిమానా విధించారు. ఈ మొత్తాన్ని వారి నుంచి రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో రఘువరన్, అడిషనల్ పీడీ మదన్‌మోహన్, డీపీవో దేవేందర్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ కృష్ణారెడ్డి, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, ఏపీవో తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో దోషికి జీవితఖైదుపై ఐఎంఏ హర్షం

మెట్‌పల్లి: కోల్‌కత్తాకు చెందిన వైద్యురాలి హత్య కేసులో దోషికి కోర్టు జీవిత ఖైదు శిక్షను విధించడం పట్ల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో మంగళవారం మాట్లాడారు. ఈ కేసులో అనుమానితులుగా కొందరు వ్యక్తులు ఉన్నారని, దీనిపై కూడా పూర్తి స్థాయిలో విచారణ జరిపి తగిన శిక్షను విధించాలని కోరారు. ఇందులో అధ్యక్షుడు గంగసాగర్, రవి, నిర్మల్‌రెడ్డి, అమరేశ్వర్, రమేష్‌రెడ్డి, రాజ్యలక్ష్మీ, సాయికృష్ణ తదితరులున్నారు.

పశువులకు వైద్య పరీక్షలు

మేడిపల్లి: భీమారం మండలంలోని లింగంపేటలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశువులకు చుడి పరీక్షలు చేశారు. డా.వెన్నెల మాట్లాడుతూ పశువులకు సెక్స్ సోర్టెన్ సెమెన్ వేయించడం వలన ఆడ దూడలు మాత్రమే పుడతాయని రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.